

మద్యం తాగనివ్వడం లేదని
తండ్రిని చంపిన కుమారుడు
● కత్తితో పొడిచి ఘాతుకం
6లో..



నర్సాపూర్‌లో నిర్వహించిన సభకు హాజరైన జనం

అభివాదం చేస్తున్న రాహుల్‌గాంధీ

ఇందిరాగాంధీ గతంలో గెలిచిన మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఆమె మనవడు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నిర్వహించిన జనజాతరకు అపూర్వ స్పందన వచ్చింది. నర్సాపూర్ వేదికగా ఆయన కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీపై నిప్పులు చెరిగారు. ఇందిరాగాంధీ విజయాన్ని పునరావృతం చేసే దిశగా ఆయన జన జాతర సభలో కాంగ్రెస్ తరపున ప్రచారం నిర్వహించారు. తెలంగాణ అభివృద్ధికి ఢిల్లీలో సైనికుడిలా పనిచేస్తానన్నారు. రాష్ట్రాభివృద్ధికి ఏది అవసరమో ఢిల్లీ నుంచి అమలయ్యేలా చూస్తానని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారు. ఆయన వేదిక నుంచి 14 నిమిషాల పాటు ప్రసంగించారు. మాట్లాడినంత సేపు సభా ప్రాంగణం హోరెత్తింది. అంతకుముందు సీఎం రేవంత్‌రెడ్డి ప్రసగించారు.

ఇందిరమ్మ గెలిచిన చోట..
రాహుల్ జన జాతర

- 14 నిమిషాల పాటు ప్రసంగించిన అగ్రనేత
- కాంగ్రెస్ కార్యకర్తల్లో జోష్
- బీజేపీ, బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ఫైర్

ఈ ప్రాంతంపై ప్రేమతో ఎంతో చేశారు

నర్సాపూర్, మే 9: ఇందిరాగాంధీ ఎంపీగా ఉన్నపుడే ఉమ్మడి మెదక్ జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి సాధించిందని, దేశం నలుమూలల నుంచి వచ్చిన వారికి ఉపాధి కల్పించారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 25 ఏళ్లుగా బీజేపీ, బీఆర్ఎస్ హయాంలో ఈ ప్రాంతం వెనుకబడిందని విమర్శించారు. నర్సాపూర్‌లో గురువారం నిర్వహించిన జన జాతర సభకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఇందిరాగాంధీ మెదక్ ఎంపీగా గెలిచి ప్రధానికి అయ్యారని గుర్తుచేశారు. ప్రధానిగా ఆమె ఈ జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. ఆమె హయాంలోనే బీడీఎల్, బీహెచ్ఈఎల్, ఆర్డినెన్స్ తదితర ప్రతిష్ఠాత్మకమైన పరిశ్రమలను ఏర్పాటు చేశారని చెప్పారు. పటాన్‌చెరుతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వేలాది పరిశ్రమలు ఏర్పాటయ్యాయని, లక్షలాది మందికి ఉపాధి కల్పించారని కొనియాడారు. గత 25 ఏళ్లుగా ఈ ప్రాంతం నుంచి ప్రాతినిధ్యం వహించిన బీఆర్ఎస్, బీజేపీ హయాంలో నియోజకవర్గం అన్నివిధాలుగా వెనుకబడిందని విమర్శించారు. బీజేపీ నుంచి రఘునందన్‌రావును దుబ్బాక ఉప ఎన్నికలో ఎమ్మెల్యేగా గెలిపిస్తే కేంద్రం నుంచి ఒక్క రూపాయి కూడా తేలేదని విమర్శించారు. అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడి ప్రజలు ఆయనను చిత్తుగా ఓడించారని అన్నారు. ఎమ్మెల్యేగానే ఏమీ చేయలేని వ్యక్తి ఎంపీగా గెలిచి ఏంచేస్తాడని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌కు జిల్లాలో నాయకులే దొరకనట్టు కరీంనగర్‌కు చెందిన వెంకట్రామారెడ్డికి టికెట్ ఇచ్చిందని విమర్శించారు. కేసీఆర్, హరీశ్‌రావుకు భారీగా డబ్బు ముట్టజెప్పడంతోనే ఇప్పటికే ఎమ్మెల్సీగా ఉన్నా ఎంపీ టికెట్‌కూడా ఆయనకే ఇచ్చారని ఆరోపించారు. వెంకట్రామారెడ్డి కలెక్టర్‌గా ఉన్న సమయంలో ప్రాజెక్టుల కోసం భూములిచ్చిన రైతులు పరిహారం అడిగితే పోలీసులతో కొట్టించారని ఆరోపిం చారు. నర్సాపూర్ నుంచి రెండుసార్లు గెలిచిన మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి వయసుకు కూడా గౌరవం ఇవ్వకుండా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్నా బీజేపీ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఇచ్చిందేమీ లేదని గాడిదగుడ్డు తప్ప.. అని రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు ఈ ప్రాంతానికి ఏమీ చేయరని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షి, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఏఐసీసీ పార్లమెంట్ ఇన్‌చార్జి సురేశ్, మెదక్ ఎమ్మెల్యే రోహిత్, మాజీ ఎమ్మెల్యేలు, మైనంపల్లి హన్మంతరావు, మదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ, డీసీసీ అధ్యక్షురాలు నిర్మల, ఆంజనేయులు గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, రాష్ట్ర నాయకులు కుసుమకుమార్, సుహాసినిరెడ్డి, శేషసాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వేదికపై ఏఐసీసీ నేతలు, మంత్రులు, నాయకులు



మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం

పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా మెదక్ నియోజకవర్గ పరిధిలోని నర్సాపూర్‌లో గురువారం నిర్వహించిన జనజాతర ప్రచారసభ విజయవంతం కావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నిండింది. సభకు జాతీయ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పాల్గొన్న ఈ సభకు మెదక్ పార్లమెంటు పరిధిలోని సెగ్మెంట్ల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలి వచ్చారు. భారీగా జనం రావడంతో సభ ప్రాంగణం కిక్కిరిసింది. కార్యక్రమం పూర్తయ్యాక సభా ప్రాంగణం నుంచి బయటకురావడానికి గంట పట్టింది. సభ సక్సెస్ కావడంతో పార్టీ నాయకుల్లో ఆనందం వ్యక్తమవుతున్నది.

కుటుంబ పాలన నుంచి విముక్తి : దామోదర్

తొమ్మిదేళ్ల కేసీఆర్ కుటుంబ పాలన నుంచి తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ విముక్తి కలిగించిందని, రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని ప్రజాపాలనలో ప్రజలు స్వేచ్ఛను పొందారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన నాలుగున్నర నెలల్లోనే ఐదు గ్యారెంటీలు అమలు చేస్తున్నామని చెప్పారు. త్వరలోనే రైతులకు రుణమాఫీ, పేదలకు ఇళ్లు, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ కూడా అమలుచేసి తీరుతామని తెలిపారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకునే పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని అన్నారు.

పేదల పక్షపాతి కాంగ్రెస్ : కొండా సురేఖ

పేదల కోసం పనిచేసే పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని అటవీశాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. నర్సాపూర్ జనజాతర సభలో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్‌గాంధీ వెనుకబడినవర్గాల పక్షపాతి అని అన్నారు. దేశవ్యాప్తంగా బీసీ గనణ చేపట్టి వారికి రావాల్సిన హక్కులు పూర్తిస్థాయిలో అందేలా చేయాలని తపిస్తున్నారని అన్నారు. ఈసారి కేంద్రంలోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, ప్రధానిగా రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో ఈ ప్రాంతాన్ని అన్నివిధాల అభివృద్ధి చేస్తామని చెప్పారు.

నేడు పురిటిగడ్డకు కేసీఆర్

- పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి తరపున ప్రచారం
- సిద్దిపేటలో ముస్తాబాద్ చౌరస్తా నుంచి భారీ రోడ్ షో
- అంబేడ్కర్ చౌరస్తా వద్ద కార్నర్ మీటింగ్

సిద్దిపేట టౌన్, మే 9 : మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి తరపున ప్రచారం నిర్వహించేందుకు నేడు పురిటి గడ్డ సిద్దిపేటకు రానున్నారు. శుక్రవారం రాత్రి 7 గంటలకు సిద్దిపేటలోని ముస్తాబాద్ చౌరస్తాకు ఆయన చేరుకోనున్నారు. అక్కడి నుంచి పాతబస్టాండ్ వద్దనున్న అంబేడ్కర్ చౌరస్తా వరకు భారీ రోడ్‌షో నిర్వహించేలా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఏర్పాట్లు చేశారు. సిద్దిపేట జిల్లా, గోదావరి నీళ్లు, రైలు కలను సాకారం చేసిన కేసీఆర్‌కు ఘన స్వాగతం పలుకుదామని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. అధికారం కోల్పోయిన తర్వాత మొదటిసారి సిద్దిపేటకు కేసీఆర్ వస్తుండడంతో పార్టీశ్రేణులు ఘనస్వాగతం పలికేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు.



సిద్దిపేట పట్టణంలో కేసీఆర్‌కు స్వాగతం పలుకుతు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

కేసీఆర్‌కు జననీరాజనం

కొండపాక/కుకునూరుపల్లి : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా కరీంనగర్‌లో ప్రచారానికి వెళ్తున్న కేసీఆర్‌కు సిద్దిపేటలోని రంగధాంపల్లి అమరవీరుల స్థూపం వద్ద పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. కేసీఆర్ బస్సులో నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అలాగే కొండపాక మండలం దుద్దెడ వద్ద, కుకునూరుపల్లిలో బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలు కేసీఆర్‌కు అభివాదం చేస్తూ జేజేలు కొట్టారు. పలువురు బీఆర్ఎస్ నాయకులు బస్సులోనికి వెళ్లి కేసీఆర్‌తో కాసేపు మాట్లాడారు.



కొండపాక మండలం దుద్దెడ వద్ద కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలు

నార్మల్ డెలివరీల సంఖ్య పెంచాలి

- జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్

గజ్వేల్, మే 9: సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ సూచించారు. గజ్వేల్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం ఐఎంఏ వైద్యులతో ఆయా చట్టాలపై ఓరియంటేషన్ ట్రైనింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సెక్షన్ ప్రసవాలను తగ్గించి, సాధారణ ప్రసవాలను పెంచాలని, ఈ-బర్త్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ఆసుపత్రుల్లో తప్పనిసరిగా ధరల పట్టికను ఏర్పాటు చేయాలని చెప్పారు. క్లినికల్ ఎస్టాబ్లిమెంట్ చట్టం ప్రకారం నడుచుకోవాలని, రిజిస్ట్రేషన్ గడువు ముగిస్తే వెంటనే రెన్యూవల్ చేయించుకోవాలని సూచించారు. రెన్యూవల్ చేయించకుండా ఆసుపత్రులు, క్లినిక్‌లు నడిపించవద్దన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలని కోరారు. కొత్త డయాగ్నోస్టిక్, కొత్త క్లినిక్‌లను ఏర్పాటు చేయాలనుకున్న వారు జిల్లా శాఖ కార్యాలయంలో సంప్రదించాలని, డీఆర్‌పి ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. డయాగ్నోస్టిక్ సెంటర్లలో వివరాలను తప్పనిసరిగా ఫారం-ఎఫ్‌లో నమోదు చేయాలన్నారు. లింగనిర్ధారణకు సంబంధించిన ఫ్లెక్సీని వెయిటింగ్ హాల్‌లో తప్పనిసరిగా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. అలాగే లింగనిర్ధారణ చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, అక్రమ అబార్షన్లను చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. జిల్లాలోని ఆర్ఎంపీ, పీఎంపీలు ప్ర థమ చికిత్స మాత్రమే చేయాలని సూచించారు. సరోగసి-ఎంటీపీ యాక్ట్-2021 ప్రకారం కార్యక్రమాలను నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభాకర్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రజనీ, గజ్వేల్ ఐఎంఏ అధ్యక్షుడు ఎలిశాల లింగం, కార్యదర్శి మహిపాల్, కోశాధికారి సుజాత, సీనియర్ వైద్యులు నరేశ్‌బాబు, మల్లయ్య, వాసవాచారి, సద్గుణచారి, మహిళా వైద్యుల అధ్యక్షురాలు పద్మజ్యోతి, ప్రోగ్రాం అధికారి శ్రీదేవి, విజయరాణి, రవీందర్‌రెడ్డి, ఏవో డేనియల్, సోఫాన్ రాథోడ్, సాయిబాబ, నవీన్, కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్

ప్రజాసేవకే నాన్న ప్రాధాన్యం

- ఆ తర్వాతనే మా కుటుంబం
- మాకు దూరంగా ఉన్నా.. జనానికి దగ్గరయ్యారు
- ఆయనను అర్థం చేసుకుంటే ప్రజలు వదులుకోరు
- మాటలు చెప్పే వాళ్లా.. చేతల్లో చూపించే వాళ్లా..
- పేద విద్యార్థులు, మహిళలు, యువత ఆలోచించాలి
- 'ఆంధ్రజ్యోతి'తో మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి తనయుడు భరత్‌రాజ్‌రెడ్డి

ఇంటర్వ్యూ 7లో..



మాట్లాడుతున్న భరత్‌రాజ్‌రెడ్డి

ఓటు వేస్తే ఉచిత ఓపీ


సిద్దిపేట క్రైం, మే 9: ఈ నెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకున్న ప్రతి ఒక్కరికీ తమ ఆస్పత్రిలో ఈ నెల 13 నుంచి 20 వరకు ఉచితంగా ఓపీ చూస్తామని సిద్దిపేట పట్టణంలోని ప్రైమ్ కేర్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి డాక్టర్ దాసరి శ్రావణ్ కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఓటు హక్కును వినియోగించుకుని మంచి నాయకుడిని ఎన్నుకోవాలని కోరారు.



బీజేపీతో పోరాడేది బీఆర్ఎస్సే

- దాని ఫలితంగానే కవిత జైలుకెళ్లింది
- ఆ పార్టీతో కలిసుంటే అరెస్టయ్యేదా?
- బీజేపీతో రేవంత్‌రెడ్డి ములాఖత్
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, మే9: బీజేపీతో పోరాడేది బీఆర్ఎస్ మాత్రమేనని, దాని ఫలితంగానే కవిత జైలు కెళ్లాల్సి వచ్చిందని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బీజేపీతో బీఆర్ఎస్ కలిసుంటే కవిత అరెస్టయ్యేదా? అని ఆయన ప్రశ్నించారు. సిద్దిపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం నిర్వహించిన ముస్లిం మైనార్టీల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి ఉన్నత విద్యావంతుడని, ప్రజలకు మంచి సేవ చేసే వ్యక్తి అని చెప్పారు. సిద్దిపేటలో ఎంపీ, ఎమ్మెల్యే ఒకే పార్టీ వ్యక్తులు ఉంటే ప్రజలకు మరింత సేవ చేయగలుగుతామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రెండు, మూడు ఉన్న రెసిడెన్షియల్ పాఠశాలలను 204కు పెంచిన ఘనత కేసీఆర్‌దేనని ఈ సందర్భంగా గుర్తుచేశారు. వెంకట్రామారెడ్డిని గెలిపించుకుని పేదలు, మైనారిటీలకు సాయం చేసుకుందామని చెప్పారు. మే13 తరువాత బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఎవ్వరూ మీకు అందుబాటులో ఉండరని, మళ్లీ అందుబాటులో ఉండేది తామేనని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో హిందూ, ముస్లింలు రెండు కళ్లలా పనిచేశామని వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీతో ములాఖత్ అయ్యి బీఆర్ఎస్ లేకుండా చేయాలని చూస్తున్నారని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేస్తే బీజేపీకే ఫయిదా అని తెలిపారు. కేసీఆర్ పదేళ్లకాలంలో కర్ఫ్యూలు, అల్లర్లు అసలే లేవని గుర్తుచేశారు. నాలుగు నెలలు గడిచినా కాంగ్రెస్ ప్రకటించిన రూ.4వేల పింఛన్, రైతులకు బోనస్ ఇవ్వడం లేదని మండిపడ్డారు. కరోనా సమయంలో ప్రతీ కుటుంబానికి 10 కిలోల బియ్యం ఇచ్చామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత కేసీఆర్ కిట్, షాదీముబారక్, జాడ లేకుండాపోయిందని తెలిపారు. కేసీఆర్ ఒక సెక్యూలర్ లీడర్ అని కొనియాడారు. రేవంత్‌రెడ్డి క్యాబినెట్‌లో ఒక్క మైనారిటీ మంత్రి కూడా లేరని, కేసీఆర్ క్యాబినెట్‌లో డిప్యూటీ సీఎం పదవిని మైనారిటీ నేతకు ఇచ్చినట్లు గుర్తుచేశారు. ఈ సమావేశంలో నాయకులు ఫారూఖ్‌హుస్సేన్, భూపేష్, జావీద్, మన్సూర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరీశ్‌రావు



సమావేశానికి హాజరైన ముస్లింలు

లోక్‌సభ ఎన్నికలు సజావుగా జరగాలి

- ప్రజలు ఎన్నికల సిబ్బందికి సహకరించాలి
- సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ



లచ్చపేటలో స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న సీపీ

దుబ్బాక, మే 9 : ఈనెల 13న జరిగే లోక్‌సభ ఎన్నికలు సజావుగా జరిగే విధంగా ప్రజలు ఎన్నికల సిబ్బందికి సహకరించాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ కోరారు. గురువారం దుబ్బాక మున్సిపాలిటీలోని లచ్చపేటలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌తో పాటు స్ట్రాంగ్‌రూంను పరిశీలించారు. స్ట్రాంగ్‌రూం వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే దుబ్బాక మండలంలోని పెద్దగుండవెళ్లి, బొప్పాపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ప్రజలు స్వేచ్ఛాయుతంగా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. సీపీ వెంట దుబ్బాక సీఐ శ్రీనివాస్, దుబ్బాక, మిరుదొడ్డి,అక్బర్‌పేట భూంపల్లి ఎస్ఐలు గంగరాజు, పరశురాములు, రవికాంతరావు, పలువురు ఉన్నారు.









సన్నాల కొనుగోలు సంగతేంటి?

- కొనేవారు లేక రైతులు విలవిల
- సిండికేటైన వ్యాపారులు
- మద్దతు ధర ప్రకటించని ప్రభుత్వం

పాపన్నపేట, మే 9 : సన్నరకం వడ్లను కొనేవారు లేక, వాటిని పండించిన రైతులు లబోదిబోమంటున్నారు. పాపన్నపేట మండలంలో యాసంగిలో దొడ్డురకంతో పాటు సన్న రకాలైన ఆమని, ఆర్ఎన్ఆర్ అనే వాటిని రైతులు పండించారు. ప్రభుత్వం ఐకేపీ ద్వారా దొడ్డు రకాలను రూ.2,203లకు మద్దతు ధర ప్రకటించి కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరిస్తున్నప్పటికీ, సన్నాలను మాత్రం విస్మరించింది. 15 రోజుల క్రితం కొనుగోలు కేంద్రాల ప్రారంభ దశలో కొంత మంది ప్రైవేట్ వ్యాపారులు సన్నాలను రూ.2,400లకు కొనుగోలు చేశారు. ఇప్పుడు మాత్రం వ్యాపారులు సిండికేట్ కావడంతో సన్నాలను కొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ధర లేక కొనేవారు రాకపోవడంతో రైతులు పండించిన సన్నాలను ఆరుబయటనే రోజుల తరబడి కుప్పలుగా పోసి కావలా ఉండాల్సిన పరిస్థితి తలెత్తింది.


సన్నాలు కొనేవారు లేక పాపన్నపేట మండలం మిన్పూర్‌లో ఆరుబయటనే ధాన్యం

సొమ్ము చేసుకోవడానికి..

ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించకపోవడంతో దళారులు రంగప్రవేశం చేశారు. సొమ్ము చేసుకోవడానికి సిండికేట్‌గా మారారు. 15 రోజుల క్రితం సన్నాలను రూ.2400 పెట్టి కొన్న వ్యాపారులు ఇప్పుడు మాత్రం ముందుకు రాకపోవడమే కాకుండా.. తక్కువ ధరకు అమ్మితే కొంటామనడంతో రైతులు ధాన్యం విక్రయించలేకపోతున్నారు. గతంలో ఇలాగే ఎవరూ ముందుకు రాకపోవటంతో విధిలేని పరిస్థితుల్లో సన్నాలను కూడా ఐకేపీ ద్వారానే విక్రయించారు. ఇది మిల్లర్లకు వరంగా మారి, కాసులు కురిపించింది. ప్రభుత్వం ఐకేపీ ద్వారా కొన్న ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ చేయడానికి ఏదైతే రైస్‌మిల్లర్‌లకు అప్పజెప్పారో.. వారు తమ చేతివాటాన్ని ప్రదర్శించి ఐకేపీ ద్వారా వచ్చిన సన్నాలను తమ వ్యాపారానికి అనుకూలంగా మార్చుకుని అధిక ధరలకు బయటకు విక్రయించారు. ఇదిలా ఉండగా మిల్లర్‌లు సీఎంఆర్‌కు ముట్టజెప్పాల్సిన లక్ష్యం కింద పీడీఎస్ బియ్యాన్ని కలిపి అక్రమంగా కొని టార్గెట్‌ను పూర్తి చేశారు. ఈ సారి కూడా కొంత మంది మిల్లర్‌లు అదే ధోరణిలో వ్యవహరిస్తున్నారు. దీనిపై ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ప్రత్యేక నిఘా పెట్టి న్యాయం చేయాలంటూ రైతులు కోరుతున్నారు.



అయ్యో పాపం

- శిశువును వదిలేసిన గుర్తుతెలియ వ్యక్తులు
- చనిపోయినట్టు నిర్ధారించిన వైద్యులు
- కేసు నమోదు చేసిన గుమ్మడిదల పోలీసులు


గుమ్మడిదల, మే 9 : పుట్టిన పసిబిడ్డను రోడ్డుపై పడేయగా, ఆ శిశువు మృతిచెందిన హృదయవిదారక సంఘటన గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామంలో గురువారం చోటుచేసుకున్నది. వివరాలకు వెళ్తే.. దోమడుగులో గురువారం ఉదయం ఓ టెంపుల్ రోడ్డు పక్కన అప్పుడే పుట్టిన మగ శిశు పడేసి ఉండడాన్ని చుట్టుపక్కల ప్రజలు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పూర్తి వివరాలు సేకరించి ప్రాథమిక వైద్య నిపుణులు, అంగనవాడి సిబ్బందికి సమాచారం అందించారు. అప్పటికే శిశువు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు గ్రామ పంచాయతీ కార్యదర్శి విష్ణువర్ధన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

మద్యం తాగనివ్వడం లేదని...
తండ్రిని చంపిన కుమారుడు

- కత్తితో పొడిచి హత్య
- దౌల్తాబాద్ మండలం హైమద్‌నగర్‌లో ఘటన

దౌల్తాబాద్, మే 9 : మద్యం తాగినవ్వడం లేదని కోపోద్రిక్తుడైన కొడుకు తండ్రిని కత్తితో పొడిచి హత్య చేసిన సంఘటన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల పరిధిలోని హైమద్‌నగర్ గ్రామంలో బుధవారం రాత్రి చోటుచేసుకున్నది. అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, తొగుట సీఐ లతీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైమద్‌నగర్ గ్రామానికి చెందిన పఠాన్ వలీఖాన్(60)కు కూతురు, కుమారుడు ఉన్నారు. కుమారుడు పఠాన్ ఫారుక్ తాగుడుకు బానిసయ్యాడు. ఫారుక్ మద్యం తాగి తల్లిదండ్రులతో తరచూ గొడవపడేవాడు. బుధవారం రాత్రి ఫారుక్ మద్యం తాగడం కోసం తల్లి అఫ్జల్‌బీ, తండ్రి వలీఖాన్‌తో గొడవపడ్డాడు. మద్యం తాగడానికి అనుమతించకపోవడంతో కోపోద్రిక్తుడైన పఠాన్ ఫారుక్ రాత్రి 11 గంటల ప్రాంతంలో తండ్రి వలీఖాన్‌పై కత్తితో కడుపులో పొడిచాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో చుట్టుపక్కల వాళ్లు వలీఖాన్‌ను చికిత్స కోసం గజ్వేల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. గ్రామస్థులు దౌల్తాబాద్ పోలీసులకు సమాచారం ఇవ్వగా గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి, తొగుట సీఐ లతీఫ్, ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ హైమద్‌నగర్ గ్రామానికి చేరుకొని హత్యకు సంబంధించిన వివరాలను సేకరించారు. మృతుడిని శవపరీక్ష కోసం గజ్వేల్ దవాఖానకు తరలించారు. వలీఖాన్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కత్తి స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.


మృతిచెందిన పఠాన్ వలీఖాన్(ఫైల్)



పగలు వ్యాపారం..
రాత్రిపూట దొంగతనాలు

- ఘరానా దొంగను అరెస్టు చేసిన పోలీసులు


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి

కుకునూరుపల్లి, మే 9 : పగటిపూట దుస్తులు అమ్ముతూ, రాత్రిపూట దొంగతనాలకు పాల్పడుతున్న ఘరానా దొంగను కుకునూరుపల్లి పోలీసులు పట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి, సీఐ లతీఫ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి వివరాలను వెల్లడించారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం బర్కత్పుర కాలనీకి చెందిన షేక్ సలీం(53) ఊరూరు తిరుగుతూ దుస్తులు అమ్ముతుంటాడు. సలీంకు వచ్చే డబ్బు సరిపోకపోవడంతో రాత్రిపూట దొంగతనాలు చేయాలని నిర్ణయించుకొని సంవత్సర కాలంగా గ్రామాలు, పట్టణాలలో తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకున్నాడు. ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాల్లో ఉన్న నగదును ఎత్తుకెళ్లేవాడు. కుకునూరుపల్లి బస్టాండ్ ఆవరణలో బుధవారం రాత్రి అనుమానాస్పదంగా కనిపిస్తూ ఉన్న సలీంను పోలీసులు పట్టుకొని విచారించగా సంవత్సర కాలంగా రాత్రిపూట దొంగతనాలు చేస్తున్నారని ఒప్పుకున్నాడు. సిద్దిపేట, చేర్యాల పట్టణాల్లో, వంటిమామిడి, కొడకండ్ల, నారాయణరావుపేట్ గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడ్డాడు. భారీ మొత్తంలో బంగారం, నగదును దొంగిలించాడు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన సీఐ లతీఫ్, ఎస్ఐ శ్రీనివాస్, క్రైమ్ పార్టీ సిబ్బంది రమేశ్‌ను ప్రత్యేకంగా అభినందించారు.



రూ.6.30 లక్షల నగదు పట్టివేత

- ఐదుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

సిద్దిపేట అర్బన్, మే 9 : సిద్దిపేట పట్టణం పొన్నాల గ్రామ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఎలాంటి ఆధారాలు లేకుండా ఉన్న రూ.6.30 లక్షలను గురువారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం విధులు నిర్వహిస్తుండగా పొన్నాల శివారులోని ముదిరాజ్ ఫంక్షన్‌హాల్‌లో డబ్బు పంపకాలు జరుగుతున్నాయని నమ్మదగిన సమాచారం రాగా త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్ సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకున్నాడు. ఫంక్షన్‌హాల్‌లో ఉన్న పయ్యావుల మల్లేశం, పయ్యావుల రాములు, చింతల శ్రీనివాస్, చింతల కుమార్, తుపాకుల బాల్‌రంగం వద్ద ఉన్న రూ.6,30,400 ఎలాంటి ఆధారాలు చూపించకపోవడంతో సీజ్ చేశారు. విచారణ అనంతరం కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభిస్తామని ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్ తెలిపారు. అయితే, ముదిరాజ్ సంఘం నెలసరి చిట్టి విషయంలో మాట్లాడుతుండగా పోలీసులు వచ్చి పట్టుకున్నారని, ఈ విషయంలో గుర్తుతెలియని రాజకీయ పార్టీల నాయకులు కావాలని కక్ష కట్టి పట్టించారని తుపాకుల బాల్‌రంగం వివరణ ఇచ్చారు.

ప్రజాసేవకే నాన్న ప్రాధాన్యత

- ఆ తర్వాతనే మా కుటుంబం
- మాకు దూరంగా ఉన్నా.. జనానికి దగ్గరయ్యారు
- ఆయనను అర్థం చేసుకుంటే ప్రజలు వదులుకోరు
- మాటలు చెప్పేవాళ్లా.. చేతల్లో చూపించేవాళ్లా..
- 'ఆంధ్రజ్యోతి'తో బీఆర్ఎస్ మెదక్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి తనయుడు భరత్‌రాజ్ రెడ్డి

ఇంటర్వ్యూ...


తండ్రి తరఫున ప్రచారం చేస్తున్న తనయుడు భరత్‌రాజ్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి, సిద్దిపేట, మే 9: మా కుటుంబం కన్నా ప్రజలు, సమాజమే 'నాన్న'కు మొదటి ప్రాధాన్యత అని బీఆర్ఎస్ మెదక్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి తనయుడు భరత్‌రాజ్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆయన ఉద్యోగరీత్యా పనుల్లో నిమగ్నమై మా కుటుంబానికి దూరంగా ఉన్నప్పటికీ ప్రజాసేవకు దగ్గరగా ఉన్నారనే సంతృప్తి మా అందరికీ ఉంది. కొందరు 'నాన్న' గురించి అసత్య ఆరోపణలు చేస్తే ఓట్లు పడతాయని అనుకుంటున్నారు. అబద్ధాలకు, చిల్లర మాటలకు ఆయన దూరంగా ఉంటారు. మాట ఇచ్చారంటే చేతల్లో చూపించడమే ఆయన ప్రత్యేకత. నమ్మకానికి నిదర్శనమే తన తండ్రి అంటూ 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలు పంచుకున్నారు భరత్‌రాజ్‌రెడ్డి. కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్‌లో ఉన్నత విద్యనభ్యసించి రాజ్‌పుష్ప కంపెనీ డైరెక్టర్‌గా ఉన్న ఆయన తన తండ్రిని గెలిపించాలని ప్రచారం చేస్తున్నారు.

మీ 'నాన్న'కే ఎందుకు ఓటెయ్యాలి..?

ఉద్యోగరీత్యా నాన్న చాలా బిజీగా ఉండేవారు. ఆయనతో మాట్లాడుదామన్నా, కలిసి ఎటైనా బయటకు వెళదామన్నా సమయం ఉండేది కాదు. ఓసారి అందరి టైమ్ సెట్ చేసుకుని కుటుంబమంతా కలిసి తిరుపతి వెళ్దామని అనుకున్నాం. మరో గంటలో బయల్దేరాల్సి ఉండగా నాన్నకు ఒక ఫోన్ వచ్చింది. నాన్న సిద్దిపేట కలెక్టర్‌గా ఉన్నప్పుడు తన దగ్గర పనిచేసిన బాబు అనే వ్యక్తికి రోడ్డు ప్రమాదం జరిగిందని తెలిసింది. అతనిది పేద కుటుంబం, ప్రాణాపాయస్థితిలో ఉన్నాడని చెప్పగానే 'నాన్న' వెంటనే తిరుపతి ప్రయాణం రద్దు చేసుకుని ఆస్పత్రికి వెళ్లి అతని కోసం డబ్బు ఖర్చుపెట్టి ప్రాణాలు కాపాడారు. అదే వ్యక్తితో తిరుపతి వెళ్లి తలనీలాలు ఇచ్చిన గొప్ప వ్యక్తిత్వం మా నాన్నది. ఇలా ఎన్నో కుటుంబాలకు బతుకుదెరువు ఇచ్చారు. వేలాదిమంది జీవితాలను నిలబెట్టారు. ఇప్పుడు ఎంపీగా గెలిస్తే మరెందరికో ఉన్నత భవిష్యత్తుతోపాటు మెదక్ ప్రాంత సమగ్ర అభివృద్ధికి పాటుపడతారు. ఒక విద్యావేత్తగా, రిటైర్డ్ కలెక్టర్‌గా సమస్యలపై పార్లమెంటులో మాట్లాడే సత్తా ఆయనకు మాత్రమే ఉంది.

ప్రజల్లో ఎలాంటి స్పందన చూస్తున్నారు..?

మెదక్ పార్లమెంటులో పోటీచేస్తున్న ఒక అభ్యర్థికి అనేక పార్టీలు మారిన రికార్డు ఉంది. ఇంకో అభ్యర్థి దుబ్బాకలో కుప్పలుతెప్పలుగా హామీలు ఇచ్చి నెరవేర్చకపోవడంతో ఓడిపోక తప్పలేదు. ఈ ఇద్దరు అభ్యర్థుల చరిత్రతో పోల్చితే మానాన్నది ఎంతో మెరుగైన వ్యక్తిత్వం. ఆయన మాట ఇస్తే తప్పరు. పేద విద్యార్థుల చదువులకు రూ.100 కోట్ల విద్యానిధి, యువతీ యువకులకు ఉచిత కోచింగ్ సెంటర్లు, ఒక్క రూపాయికే ఫంక్షన్‌హాల్‌లో శుభకార్యాలు, మహిళల ఉపాధి కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, ప్రమాదంలో చనిపోయినవారికి రూ.10 లక్షల ప్రమాదబీమా అనే ప్రజాసేవ కార్యక్రమాలపై మాట ఇచ్చారు. మిగితా ఇద్దరు ఒక్క హామీ అయినా ఇచ్చారా.. అనే చర్చ ప్రజల్లో జరుగుతోంది. నేను వెళ్లినచోటల్లా మంచి స్పందన కనిపిస్తున్నది.

ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడం సాధ్యమేనా..?

నూటికినూరు శాతం సాధ్యమే. మా నాన్న మాట ఇచ్చారంటే ప్రాణం పోయినా తప్పరనే విషయం చాలామందికి తెలుసు. ఆయన మాట ఇవ్వనే ఇవ్వడు. ఒకవేళ ఇస్తే అది నెరవేర్చేదాకా నిద్రపోడు. తనను నమ్ముకున్న ప్రజల కోసం.. తాను ప్రాణపదంగా చూసుకునే కుటుంబం మీద ప్రమాణం చేశారంటేనే ప్రజలంతా అర్థం చేసుకోవాలి. ఆయన గెలిచిన వెనువెంటనే 'పీవీఆర్ ట్రస్టు' ద్వారా ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తారు. ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులు లేనందువల్ల ఈ హామీలన్నీ అలవోకగా సాధ్యమవుతాయి. మా రాజ్‌పుష్ప కంపెనీ నుంచి సీఎస్ఆర్ నిధుల ద్వారా ఇప్పటికే అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టిన చరిత్ర మాకుంది. మా తాతల కాలం నుంచే ప్రజాసేవలో నిమగ్నమైన కుటుంబం మాది. 'నాన్న'కు డబ్బు, పదవుల కన్నా ప్రజల్లో నమ్మకాన్ని పొందడమే ఎక్కువ సంతోషాన్ని కలిగిస్తుందని చాలా సందర్భాల్లో రుజువు చేసుకున్నారు.

మీ కుటుంబమంతా ప్రచారంలో పాల్గొంటున్నారా..?

మాది ఉమ్మడి కుటుంబం. నాన్నవాళ్లు ఐదుగురు అన్నదమ్ములు. ఇప్పటికీ ఒకే ఇల్లు, ఒకే వంటగది, ఒకే డైనింగ్. అన్నదమ్ములంతా నిజాయితీగా ఉన్నందుకే ఉమ్మడిగా ఉంటున్నారు. అదే నిజాయితీని తన ఉద్యోగ జీవితంలో 'నాన్న' చూపించి ముఖ్యమంత్రులు, మంత్రులతోపాటు ప్రజల మన్ననలు పొందారు. అలాంటి వ్యక్తి ఎంపీగా గెలవాలని కోరుకుంటూ నాతోపాటు మా కుటుంబం, మా కుటుంబ ఆత్మీయులు, శ్రేయోభిలాషులు ప్రచారంలో నిమగ్నమయ్యారు. 'నాన్న' తిరుపతి, చిత్తూరు ఆర్డీవోగా పనిచేసిన కాలంలో పరిచయమైన వ్యక్తులు అక్కడి నుంచి వచ్చి ప్రచారం చేస్తున్నారంటేనే మీరు అర్థం చేసుకోవచ్చు. 'నాన్న' గురించి సరిగా అర్థం చేసుకుంటే వదులుకోలేరు.

మీ నాన్న మీద వచ్చే ఆరోపణలపై..?

మా నాన్న అధికార దుర్వినియోగం చేసి ఉంటే ఆయన కోసం ప్రచారం చేయడానికి ఎక్కడెక్కడి నుంచో ప్రజలు రారు. ఆయనే హద్దులు దాటి ప్రవర్తించి ఉంటే అభాగ్యులైన కుటుంబాలన్నీ ఈరోజు నాన్నకు అండగా ఉండేవి కాదు. ఆయనే అవినీతిపరుడైతే కనీసం ఒక్క వ్యక్తయినా వచ్చి ఫలానా వెంకట్రామారెడ్డికి తాము డబ్బులిచ్చామని చెప్పాలి కదా. నాన్న అసమర్థుడే అయితే తెలంగాణను తెచ్చిన బీఆర్ఎస్ ఎంపీగా నిలబెట్టేదే కాదు.. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజల నుంచి ఇంతటి బ్రహ్మరథం పట్టేవారే కాదు. మిగితా అభ్యర్థులు తమ ఓటమి భయంతో నాన్నపై అనవసర ఆరోపణలు చేయిస్తున్నారు. ఫేక్ వీడియోలు, ఫొటోలతో దుష్ప్రచారం చేస్తున్నారు. విధి నిర్వహణలో ఒకరిద్దరికి తాత్కాలికంగా ఇబ్బందులు కలిగినా.. వేలాది, లక్షలాది మందికి ప్రయోజనం చేకూర్చిన ఘనత మా నాన్నది. అందుకే మిగితా అభ్యర్థులతో బేరీజు వేసుకొని క్షుణ్ణంగా ఆలోచించి ఓటు హక్కు వినియోగించుకోవాలి.

కేసీఆర్‌ను దూరం చేసుకుని ప్రజలు బాధపడుతున్నారు: అనిల్

సిద్దిపేట టౌన్, మే 9: తెలంగాణ ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను దూరం చేసుకున్న ప్రజలు ఎంతో బాధపడుతున్నారని బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సెల్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కుర్మాచలం అన్నారు. గురువారం సిద్దిపేట పట్టణంలోని మాజీ మంత్రి హరీశ్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కష్టపడే తత్వం ఉన్న హరీశ్‌రావుకు తోడుగా బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డిని గెలిపిస్తే అభివృద్ధిలో మెదక్ పార్లమెంటు నియోజకవర్గం దూసుకుపోతుందన్నారు. గత పదేళ్లలో మాజీ సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలను రూపొందించి అమలు పరిచారని తెలిపారు. ఆ పథకాలను ప్రతిపక్ష పార్టీలు ప్రజల్లోకి వ్యతిరేక ధోరణితో తీసుకెళ్లడంతో, స్వల్ప తేడాతో అధికారం కోల్పోయినట్లు చెప్పారు. బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని వేడుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి


హవేళిఘణపూర్‌లో వెంకట్రామారెడ్డికి ఓటేయాలని అభ్యర్థిస్తున్న పద్మారెడ్డి

హవేళిఘణపూర్/చిన్నశంకరంపేట, మే 9: గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన హవేళిఘణపూర్‌లో బీఆర్ఎస్ మెదక్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటిఇంటికి తిరుగుతూ కారు గుర్తుకు ఓటువేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శేరి నారాయణరెడ్డి, కౌన్సిలర్ భీమరి కిశోర్, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మేకల సాయిలు, రామచంద్రారెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేస్తే ప్రజలు మోసపోయినట్టేనని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా చిన్నశంకరంపేట మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

●గజ్వేల్: ఎంపీగా వెంకట్రామారెడ్డిని గెలిపించుకుని కేసీఆర్‌కు అండగా నిలుద్దామని శాసనమండలి సభ్యుడు డాక్టర్ వంటేరి యాదవరెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని 18వ వార్డులో మునిసిపల్ చైర్మన్ రాజమౌళి ఎన్నికల ప్రచారంలో భాగంగా యాదవరెడ్డిని ఓటు అడిగారు.

●వర్గల్: నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన మాజీ సీఎం కేసీఆర్‌ను ప్రజలు మరువొద్దని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం వర్గల్ మండలం దండుపల్లి గ్రామానికి చెందిన మాజీ వార్డుమెంబర్ శ్రీనివాస్ బీఆర్ఎస్‌లో చేరారు.

కేసీఆర్‌కే మా మద్దతు

మనోహరాబాద్, మే 9: కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ముదిరాజ్ కులస్థులకు న్యాయం జరిగిందని, కావున కేసీఆర్‌కే మా మద్దతు అని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి స్పష్టం చేశారు. గురువారం మనోహరాబాద్ మండల కేంద్రం కూచారంలోని ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనానికి యాదగిరి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆత్మీయ సమ్మేళనంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డితో టెలీ కాన్ఫరెన్స్‌లో ముదిరాజ్ కులస్థులమంతా బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తామని ఫోన్‌లో హామీనిచ్చారు. ఈ సమ్మేళనంలో ఎంపీపీ పురం నవనీతరవి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహేష్ పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా 400 స్థానాల్లో ఘన విజయం


జహీరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్

జహీరాబాద్, మే 9: దేశవ్యాప్తంగా ప్రజలు ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్న నేపథ్యంలో 400 స్థానాల్లో విజయం సాధిస్తామని జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం జహీరాబాద్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లకాలంగా నరేంద్రమోదీ ప్రభుత్వం అన్నిరంగాల, వర్గాల అభ్యున్నతికి కృషిచేసిందన్నారు. మోదీ హయాంలోనే దేశం సుభిక్షంగా ఉన్నదని, ఇదే తరహాలో అభివృద్ధి పథంలో కొనసాగాలంటే బీజేపీకి ఓటేసి గెలిపించాల్సిన అవసరం ఉన్నదన్నారు. అలాగే బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డికి పలువురు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ నాయకులు జైపాల్‌రెడ్డి, నాయకులు ఉమాకాంత్‌పాటిల్, సుభాష్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, శివాజీరావుపాటిల్, అరుణ్ పాటిల్, జిల్లా లింగాయత్‌సమాజ్ నాయకురాలు మంజులాకౌళాస్ పాల్గొన్నారు. రాజస్థాన్ ఎమ్మెల్యే నారాయణసింగ్, జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి తదితరులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రజలు నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలోపేతం చేసేందుకు సిద్ధమయ్యారన్నారు.

రాజ్యాంగాన్ని మారుస్తామన్నది అసత్య ప్రచారం

టేక్మాల్, మే 9: బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఎత్తేస్తారని, రాజ్యాంగాన్ని మారుస్తారనేది అసత్య ప్రచారమని బీజేపీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. గురువారం మండల పరిధిలోని పల్వంచ గ్రామంలోని ఓ ఫాంహౌస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదని, దేశంలో అసమానతలు తొలగిపోవాలంటే రిజర్వేషన్ల అవసరం ఉన్నదని పునరుద్ఘాటించారు. అంబేద్కర్ రాజ్యాంగమే పవిత్ర గ్రంథమని ప్రధాని మోదీ చాలా సందర్భాల్లో చెప్పారని, తాను ఉన్నంతకాలం రాజ్యాంగాన్ని మార్చనని స్పష్టం చేశారని గుర్తుచేశారు. పదేళ్లలో మోదీ ప్రభుత్వం రిజర్వేషన్లను రద్దు చేసే దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు అరుణతార, మాజీ మంత్రి ఆంజనేయులు, పార్లమెంట్ కన్వీనర్ రవిగౌడ్, అందోల్ అసెంబ్లీ సమన్వయ కర్త జగదీశ్వర్, కర్ణం శివశంకర్, సిద్దేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అత్యధిక సీట్లలో బీజేపీ గెలుపు ఖాయం

పెద్దశంకరంపేట, మే 9: తెలంగాణలో బీజేపీ అత్యధిక ఎంపీ స్థానాలు గెలవడం ఖాయమని ఓబీసీ సెల్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఆలే భాస్కర్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం బీజేపీ పెద్దశంకరంపేట మండలాధ్యక్షుడు కోణం విఠల్‌తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పదేళ్ల మోదీ పాలనలో భారతదేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందని వివరించారు. మూడోసారి కేంద్రంలో బీజేపీ 400లకు పైగా స్థానాలను కైవసం చేసుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు. బీజేపీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు పత్రి రామకృష్ణ, నాయకులు బండల శ్రావణ్‌కుమార్, ఎర్ర శ్రీహరి, సంగమేశ్వర్, బుగుడాల కృష్ణ పాల్గొన్నారు.

ఖేడ్‌లో బీజేపీ ఇంటింటి ప్రచారం

నారాయణఖేడ్, మే 9: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో గురువారం బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌కు మద్దతుగా బీజేపీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ ఖేడ్ నియోజకవర్గ కన్వీనర్ రజనీకాంత్, నాయకులు రాజుగౌడ్, విజయ్‌షెట్కార్, సుగుణాకర్, రాథోడ్ సంతోష్, వెంకట్‌రెడ్డి, విజయ్‌కుమార్ పదేళ్ల బీజేపీ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేస్తూ.. బీజేపీకి ఓటేయాలని కోరారు. అలాగే బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయిరాం ఖేడ్ మండలంలోని పోతన్‌పల్లి, ర్యాకల్, గంగాపూర్, సంజీవన్‌రావుపేట, నర్సాపూర్, నర్సాపూర్‌తండా, నమ్లీమేట్, గనుకులకుంట, హన్మంత్‌రావుపేట, లింగనాయక్‌పల్లి, మాద్వార్ తండాల్లో ప్రచారం నిర్వహించారు.

దేశానికి నరేంద్రమోదీయే శ్రీరామ రక్ష

- ఉడత బెదిరింపులకు భయపడే వ్యక్తిని కాను
- సీఎం రేవంత్‌రెడ్డివి పచ్చి అబద్ధాలు
- బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు

దుబ్బాక, మే 9: దేశానికి ప్రధాని మోదీయే శ్రీరామరక్ష అని, దేశంలో 400ల సీట్లు గెలవడం ఖాయమని బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు ధీమా వ్యక్తం చేశారు. గురువారం దుబ్బాక మండలం హబ్షీపూర్ గ్రామం నుంచి దుబ్బాక వరకు కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా దుబ్బాక బస్టాండ్ వద్ద రోడ్‌షోలో మాట్లాడారు. దుబ్బాకలో తాను చెల్లని రూపాయిని అయితే... కామారెడ్డిలో చెల్లని మాజీ సీఎం కేసీఆర్ రాష్టానికి ఎలా చెల్లుతారని ప్రశ్నించారు. దుబ్బాక అభివృద్ధి కోసం తాను అహర్నిశలు కృషి చేశానని తెలిపారు. మీరు చేసే ఉడత బెదిరింపులకు భయపడే వ్యక్తికి కాదన్నారు. రాజకీయంలో గెలుపు ఓటములు సహజమని, సీఎం కేసీఆర్‌ను 1983లో సిద్దిపేటలో ఓడించిన విషయాన్ని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధపు హామీతో అధికారంలోకి వచ్చారన్నారు. దుబ్బాక బస్టాండ్‌ను గత ప్రభుత్వ మెడలు వంచి నూతనంగా నిర్మించామని గుర్తుచేశారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుపై ఓటుచేసి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాలేష్‌గౌడ్, ఎస్ఎన్ చారి, విభూషన్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి ఆయా మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

నిజాంపేట, మే 9: ప్రధాని నరేంద్రమోదీ దేశానికి చేస్తున్న సేవలు, బడుగు, బలహీనవర్గాలకు అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులపై బీజేపీలో చేరుతున్నారని జడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్ అన్నారు. గురువారం మెదక్ జిల్లా నిజాంపేట మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మాసాయిపేట పార్లమెంట్ కార్యాలయంలో ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు సమక్షంలో పార్టీలో చేరగా.. వారికి కండువా కప్పి ఆహ్వానించారు. బీజేపీ కార్యకర్తలను గుండెల్లో పెట్టి చూసుకుంటామని రఘునందన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ దేశ ప్రజలు మోదీ వైపు చూస్తున్నారని, కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డుసభ్యులు ఆముదరాజు, తాడెం తిరుపతి, రాంగారి స్వామిలు, సిద్ధ రాంరెడ్డి, పంజా బాబు పాల్గొన్నారు.

రఘునందన్‌రావు గెలుపు కోసం..

మెదక్ అర్బన్, మే 9: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం స్థానిక నల్లపోచమ్మ కాలనీలో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు గెలుపు కోరుతూ.. బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరిస్తూ.. రఘునందన్‌రావును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్‌రెడ్డి పట్టణ అధ్యక్షులు ప్రసాద్, కార్యదర్శి రాజు, జిల్లా నాయకులు లోకేష్, పట్టణ మహిళా మోర్చా అధ్యక్షులురాలు ప్రవళిక, నాయకులు ఉదయ్‌కిరణ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



దుబ్బాకలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

రఘునందన్‌రావుకు మద్దతుగా ప్రచారం

కుకునూరుపల్లి, మే 9: బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా గురువారం కుకునూరుపల్లి మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో రఘునందన్‌రావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దొంతి సత్యం, మంద రాజు, సాకలి అంజనేయులు, ఈగ శ్రీనివాస్, కొంతం చంద్రం, ఇండ్ల కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి: సురేష్‌షెట్కార్

నారాయణఖేడ్, మే 9: తాను జహీరాబాద్ మొదటి ఎంపీగా, నారాయణఖేడ్ ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధిని చూసి ఈ ఎన్నికల్లో తనను ఆదరించాలని కాంగ్రెస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కార్ ప్రజలను కోరారు. గురువారం ఖేడ్‌లోని ఆయన నివాసంలో కారముంగి ఎంపీటీసీ, మాజీ మనూరు ఎంపీపీ ఉపాధ్యక్షుడు గడ్డ రమేష్, నాయకులు సంతోష్, శంకర్, పుల్‌కుర్తికి చెందిన నాయకులు ప్రతాప్‌రెడ్డి, దత్తురెడ్డి, పొట్‌పల్లికి చెందిన పవన్‌పటేల్, చిన్నసేరి ప్రతాప్‌రెడ్డి, బీబీపేట మాజీ సర్పంచ్ రాములునాయక్ సురేష్‌షెట్కార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సురేష్‌షెట్కార్ మాట్లాడుతూ అభివృద్ధితో పాటు అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో పార్లమెంట్ నియోజకవర్గంలో రెండు మోడల్ డిగ్రీ కళాశాలలను, 15 మోడల్ పాఠశాలలను, నేషనల్ హైవేను మంజూరు చేయించామన్నారు. జహీరాబాద్‌లో కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయించామన్నారు. బోధన్-బీదర్ రైల్వే మార్గానికి కూడా ప్రతిపాదనలు చేయించి, సర్వే పనులకు నిధులు మంజూరు చేయించానని పేర్కొన్నారు. తాను చేసిన అభివృద్ధిని చూసి మరో అవకాశం కల్పించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా జడ్పీ ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు నగేష్‌షెట్కార్, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు పోతుల సంగారెడ్డి, మారుతినాయక్, తదితరులు పాల్గొన్నారు.


నారాయణఖేడ్‌లో సురేష్‌షెట్కార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు


నాగల్‌గిద్ద మండలంలో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న పలువురు నాయకులు

సైనికుల్లా పనిచేయాలి: ఎమ్మెల్యే

నాగల్‌గిద్ద, మే 9: కాంగ్రెస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కార్ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పటోళ్ల సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నాగల్‌గిద్ద మండల కేంద్రంతోపాటు కరస్‌గుత్తి గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అభివృద్ధి ఏ మాత్రం జరగలేదన్నారు. తాను ఎమ్మెల్యే గెలిచిన తర్వాత నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణానికి రూ.50 కోట్ల నిధులను మంజూరు చేయించానన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్, పార్లమెంట్ ఎన్నికల అసెంబ్లీ ఇన్‌చార్జి శశికాదయాదవరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు మాణిక్‌రావుపాటిల్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్, ఎంపీటీసీ పండరినాథ్‌రావు పటేల్, మాజీ ఎంపీపీ శంకరయ్యస్వామి, నాయకులు పాల్గొన్నారు. కాగా నాగల్‌గిద్ద తాజా మాజీ సర్పంచ్ శివాజీతోపాటు పలువురు కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు.


విలేకరుల సమావేశంలో ఫేక్ వార్తల పేపర్లను చూపిస్తున్న బీఆర్ఎస్ నేతలు

ఫేక్ పోస్టులు పెడితే మూల్యం తప్పదు

- బీఆర్ఎస్ నేతల హెచ్చరిక

చిన్నశంకరంపేట, మే 9: ఇంటింటికి తులం బంగారం బీఆర్ఎస్ బంపర్ ఆఫర్ ఇస్తున్నదని ఫేక్ పత్రికలు, యూట్యూబ్ ఛానళ్లలో ఫేక్ పోస్టులు పెడితే మూల్యం తప్పదని బీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు. గురువారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పట్లోరి రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వెంకట్రామారెడ్డి గెలుపును జీర్ణించుకోని కొంతమంది ఫేక్ వార్తలు సృష్టించి యూట్యూబ్ ఛానళ్లలో పోస్టులు పెడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. అలాగే ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని ఎన్నికల కమిషనర్‌కు కూడా ఫిర్యాదు చేస్తున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్, బీజేపీలు మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజలకు అన్నివిధాలుగా సంక్షేమాలు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఏకే. గంగాధర్‌రావు, వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, సొసైటీ చైర్మన్ అంజిరెడ్డి, ఎంపీటీసీలు యాదగిరి, గొండ స్వామి, మాజీ సర్పంచ్ కుమార్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఇళ్ల వద్దే పశువులను కట్టేసుకోవాలి

ధూళిమిట్ట, మే 9: రైతులు రాత్రి సమయాల్లో పశువులను వ్యవసాయ బావుల దగ్గర కాకుండా ఇళ్ల వద్దే కట్టేసుకోవాలని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాము సూచించారు. ధూళిమిట్ట మండలం కూటిగల్ గ్రామంలో మంగళవారం లేగదూడపై గుర్తుతెలియని జంతువు దాడిచేసిన ప్రాంతాన్ని ఆయన రైతులతో కలిసి శుక్రవారం పరిశీలించి, ఆనవాళ్లు సేకరించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ పశువులను బావుల వద్ద కట్టేయాలనుకుంటే పాకశాలల వద్ద రక్షణగా జాలీలతో కానీ, ఇతర వస్తువులతో కానీ కంచెలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమీపంలో అటవీ ప్రాంతం లేనందున రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కొన్నిసార్లు అడవి జంతువులు దారి తప్పి గ్రామాల్లోకి వస్తుంటాయని, రైతులు అప్రమత్తంగా ఉండి పశువులను కాపాడుకోవాలన్నారు. ఇలాంటి సంఘటనలు జరిగిన వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని చెప్పారు.


దాడిచేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాము

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనిత

రాయపోల్, మే 9: రాయపోల్ మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం గురువారం ఎంపీపీ కల్లూరి అనిత అధ్యక్షతన సాదాసీదాగా జరిగింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధికారులందరూ హాజరుకాలేదు. వచ్చిన అధికారులు నివేదికలు చదివి వినిపించారు. సభ్యులు లేవనెత్తిన సమస్యలను నోట్ చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలయ్య, ఎంపీటీసీలు నాగలింగం, వెంకటయ్య, లక్ష్మి, కోఆప్షన్ సభ్యులు పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

బోళ్ల మాధవికి డాక్టరేట్

మునిపల్లి, మే 9: మండలంలోని బుదేరా మహిళా డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ విభాగంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న బోళ్ల మాధవి డాక్టరేట్ సాధించారు. 'ఆంగ్ల సాహిత్యంలో ఆఫ్రికన్ అమెరికన్ మహిళా రచయిత్రుల పాత్ర' అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కొండ నాగేశ్వర్‌రావు పర్యవేక్షణలో పరిశోధన చేశారు.

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలి

● డీఆర్‌డీవో జయదేవ్ ఆర్య

నంగునూరు, మే 9: గ్రామంలో జాబ్‌కార్డు ఉన్న కూలీలకు ఉపాధి కల్పించాలని డీఆర్‌డీవో జయదేవ్ ఆర్య అన్నారు. నంగునూరు గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను గురువారం పరిశీలించి మాట్లాడారు. ఉదయం పనులకు త్వరగా వెళ్లి ఎండ తీవ్రత కాకముందే పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పని ప్రదేశం వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కూలీలు వడదెబ్బకు గురికాకుండా చూడాలన్నారు. ఉపాధిహామీ కూలీలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వేసవిలో నర్సరీలపై దృష్టి సారించి మొక్కలు ఎండకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్, పంచాయతీ కార్యదర్శి చంద్రకళ, టెక్నికల్ అసిస్టెంట్ కొండల్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

మద్దూరు, మే 9: మండలంలోని రేబర్తి గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనుల్ని గురువారం అదనపు డీఆర్‌డీవో బాలకృష్ణ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. ఉపాధిహామీ నిబంధనల మేరకు పనులు నిర్వహిస్తున్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. పనిప్రదేశంలో ఏర్పాటు చేసే నీడ సౌకర్యంతో పాటు మంచి నీళ్లు, మందులపై ఆరా తీశారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరుపై సంతృప్తి చెందారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కూలీల కోసం ప్రవేశపెట్టిన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏమైనా అవకతవకలు జరిగితే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఈసీ పరుశురాములు, టీఏ వెంకటమ్మ, పంచాయతీ కార్యదర్శి మాదవ్, ఫీల్డు అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



నంగునూరులో ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో జయదేవ్ ఆర్య



మద్దూరు: రేబర్తిలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న అదనపు డీఆర్‌డీవో బాలకృష్ణ

కూలీలకు కనీస వేతనం ఇవ్వారా ?

వర్గల్, మే 9: ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు కనీస వేతనం ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం శ్రమ దోపిడి చేస్తున్నదని దళిత బహుజన ఫ్రంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు ఆరోపించారు. గురువారం వర్గల్ మండలంలోని మైలారం, చౌదరిపల్లి, లింగారెడ్డిపల్లి, చాంద్‌ఖాన్‌మక్తా గ్రామాల్లో చెరువుల వద్ద పనిచేస్తున్న ఉపాధిహామీ కూలీలను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి కూలీలకు కనీస కూలీ 300 ఇవ్వాలని ఉందని, కాని కూలీలకు 100 నుంచి 150 లోపే చెల్లిస్తున్నారన్నారు. వేసవిలో తాగునీటి, పనిముట్లైన గడ్డపార, పారల చార్జీలను అందించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నరని తెలిపారు. పనిదినాలను 100 నుంచి 200 రోజులకు పెంచాలన్నారు. వికలాంగులకు, ఒంటరి మహిళలకు సంవత్సరంలో 250 రోజుల పని కల్పించాలన్నారు.

ఎన్నికలు సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలి

● కరీంనగర్ పార్లమెంట్ జనరల్ అబ్జర్వర్ అమిత్ కటారియా



సమావేశంలో మాట్లాడుతున్న జనరల్ అబ్జర్వర్ అమిత్ కటారియా

హుస్నాబాద్, మే 9 : పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేలా పకడ్బందిగా ఏర్పాట్లు చేయాలని కరీంనగర్ పార్లమెంట్ జనరల్ అబ్జర్వర్ అమిత్ కటారియా అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి హుస్నాబాద్ పట్టణంలోని ఐఓసీ భవనంలో ఎన్నికల సిబ్బంది, తహసీల్దార్లు, ఎంపీడీవోలకు ఎన్నికల నిర్వాహణపై జరిగిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల విధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నియోజకవర్గ కేంద్రంలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని నియోజకవర్గ అసిస్టెంట్, ఎన్నికల అధికారి రామ్మూర్తిని ఆదేశించారు. 13న ఎన్నికలు ముగిసిన తరువాత ముగింపు సమాచారాన్ని అధికారులకు నివేదిక సమర్పించి ఈవీఎంలను కరీంనగర్ స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించాలని సూచించారు. పట్టణంలోని మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. బాలుర ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటర్ల వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, రుక్మిణి తదితరులున్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న లారీల పట్టివేత

సిద్దిపేట క్రైం /చిన్నకోడూరు, మే 9: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు లారీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సిద్దిపేట పట్టణ శివారులోని నర్సాపూర్ చౌరస్తా రాజీవ్ రహదారి పక్కన ఉన్న ఓ కాంట వద్ద గురువారం ఉదయం మూడు లారీల్లో అక్రమంగా ఇసుకను హైదరాబాద్ తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, సిద్దిపేట టూ టౌన్ పోలీసులు పట్టుకున్నారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న లారీని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, చిన్నకోడూరు పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం ఎలాంటి అనుమతి లేకుండా లారీలో భూపాలపల్లి నుంచి సిద్దిపేటకు ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు, గురువారం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, చిన్నకోడూరు పోలీసులు సంయుక్తంగా మండలంలోని రామునిపట్ల గ్రామ శివారులో వాహనాల తనిఖీ చేసి లారీని పట్టుకున్నారు. ఇసుక లారీని స్వాధీనం చేసుకొని, అనంతసాగర్‌కు చెందిన లారీ డ్రైవర్ రాంరెడ్డి, లారీ యజమాని నర్సింహారెడ్డి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వాసవీయూత్ క్లబ్ అధ్యక్షుడిగా జిల్లా ప్రసాద్

గజ్వేల్, మే 9: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ వాసవీయూత్ క్లబ్ అధ్యక్షుడిగా జిల్లా ప్రసాద్‌ను నియమించినట్లు వాసవీక్లబ్ గజ్వేల్ అధ్యక్షుడు జగ్గయ్యగారి శేఖర్‌గుప్తా తెలిపారు. గజ్వేల్ పట్టణంలో యూత్ కమిటీని వాసవీక్లబ్ ప్రధాన కార్యదర్శి సిద్ది నవీన్‌గుప్తాతో కలసి నియమించారు. వాసవీ యూత్ క్లబ్ అధ్యక్షుడిగా జిల్లా ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కొమురవెల్లి సంపత్‌కుమార్‌లను నియమించారు. ఈ మేరకు వారికి ఉత్తర్వులను అందజేశారు. సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. వారితో వాసవీ క్లబ్ సభ్యులు గంగిశెట్టి ఉమేశ్, పడకంటి రవి, దొంతుల యాదగిరి, కైలాస ప్రశాంత్, గుడాల సందీప్‌కుమార్, తోట సంపత్, బుస్స నితీష్‌లు పాల్గొన్నారు.

కార్యకర్తల మధ్య విభేదాలు

చిన్నకోడూరు, మే 9 :కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. మండలంలోని గోనెపల్లిలో బుధవారం రాత్రి కాంగ్రెస్‌కు చెందిన ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓ వర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు మండలంలోని కస్తూరిపల్లి, ఓబులాపూర్ గ్రామాల్లో ప్రచారం ముగించుకొని గోనెపల్లి గ్రామానికి వచ్చేసరికి, మరో వర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. స్థానిక నాయకులకు, కార్యకర్తలకు సమాచారం ఇవ్వకుండా గ్రామానికి వచ్చి ప్రచారం ఎలా చేస్తారని ప్రశ్నించారు. దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగి విమర్శలు చేసుకున్నారు. సమాచారం అందుకున్న చిన్నకోడూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

చేర్యాల, మే 9 : పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో చేర్యాల పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను గురువారం మునిసిపల్ ఇన్‌చార్జి కమిషనర్ జి.నర్సయ్య పరిశీలించారు. కేంద్రాలలో చేపట్టనున్న వసతుల కల్పనను పరిశీలించారు.



దుబ్బాకలో బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి మద్దతుగా దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి సతీమణి మంజుల ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ వృద్ధురాలిని అవ్వా అసరా ఇచ్చిన పెద్దకొడుకు ఓటేసీ అసరివ్వా అని కోరారు.

- దుబ్బాక



దుబ్బాక వేంకటేశ్వరాలయంలో స్వామి వారికి దండం పెడుతున్న వెంకట్రామారెడ్డి సతీమణి ప్రణీత

బీఆర్‌ఎస్‌లో చేరిక

మిరుదొడ్డి, మే 9: మిరుదొడ్డి గ్రామానికి చెందిన రంగసమైన రాజు ఇటీవల బీజేపీలో చేశారు. గురువారం దుబ్బాక మండలంలోని స్థానిక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ హయాంలోనే ప్రజలకు న్యాయం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు తోట కమలాకర్‌రెడ్డి, మనోహర్‌రావు, నాయకులు తుమ్మల బాల్‌రాజు, అంజిరెడ్డి, మల్లేశం గౌడ్, కిష్టయ్య, బాబు, రాములు, బాపురెడ్డి, రాజిరెడ్డి ఉన్నారు.

బీజేపీతోనే దేశ అభివృద్ధి సాధ్యం

దౌల్తాబాద్/గజ్వేల్, మే 9: బీజేపీ ప్రభుత్వంతోనే దేశ అభివృద్ధి సాధ్యమని బీజేపీ మండల అధ్యక్షుడు సర్వుగారి భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో బీజేపీకి ఓటు వేసి మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావును భారీ మోజార్టీతో గెలిపించాలని కోరారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ఆయా వార్డులలో బీజేపీ నాయకులు నాయిని సందీప్, వెంకట్‌రెడ్డిలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావును గెలిపించాలని కోరారు. గజ్వేల్ మండల పరిధిలోని బంగ్లావెంకటాపూర్‌లో బీజేపీ నాయకులు బండారి మహేశ్, అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రచారాన్ని నిర్వహించి, రఘునందన్‌రావును గెలిపించాలని అభ్యర్థించారు.

'కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం'



కొండపాక: నాయకులకు కండువా కప్పుతున్న నర్సారెడ్డి

చేర్యాల/కొండపాక, మే 9: దేశానికి స్వాతంత్ర్యంతో పాటు తెలంగాణ రాష్ట్రాన్ని సిద్ధింపచేసిన కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం చేకూరుతుందని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. చేర్యాల మండలం వీరన్నపేటకు చెందిన మాజీసర్పంచు కొండపాక భిక్షపతి, మాజీ ఉపసర్పంచు గౌండ్ల వెంకటేశం, నాయకులు కలీం పాషాతో పాటు తదితరులు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొమ్ము రవి, కౌన్సిలర్ ముస్త్యాల తార యాదగిరి, రంగు శంకర్ పాల్గొన్నారు. కొండపాక మండలంలోని దుద్దెడ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్, బీఎస్పీ పార్టీల నుంచి జిల్లా సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు, దుద్దెడ మాజీ సర్పంచ్ ఆరెపల్లి మహదేవ్‌గౌడ్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే జిల్లా డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి సమక్షంలో గురువారం కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో మాజీ వార్డు మెంబర్ కొమ్ము స్వామి, బీఎస్పీ నాయకుడు కొమ్ము లక్ష్మణ్, కర్ణాకర్, బాకీ రవి, పల్లె రాజశేఖర్, రొడ్డ ప్రవీణ్, పల్లె స్వామి, కొమ్ము నర్సింహులు, అరుణ్ ,కర్ణాకర్, సాయి, పల్లె రాజు, బాలకృష్ణ, నాగరాజు, నరేష్, కృష్ణ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కోహెడ వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

జనగామ మెజార్టీ ఎటువైపు

● పట్టునిలుపుకోవాలని ఎమ్మెల్యే పల్లా ప్రయత్నాలు

● చేరికలతో బలాన్ని మూటకట్టుకున్న కాంగ్రెస్



కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, మే 9: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో భువనగిరి లోక్‌సభస్థానం పరిధిలోని జనగామ నియోజకవర్గంపై అందరిదృష్టి మళ్లింది. మొత్తంగా ఏడు నియోజకవర్గాలున్నా జనగామ ఇచ్చే తీర్పు కీలకంగా మారనుంది. అందుకు గతంలో జరిగిన ఎన్నికల్లో జనగామ ప్రజలు అందించిన మెజార్టీతోనే అభ్యర్థులు గట్టెక్కడమే నిదర్శనం. కానీ అసెంబ్లీ ఎన్నికల అనంతరం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల మధ్య మారిన రాజకీయ పరిణామాలతో ఓటర్లు ప్రస్తుతం ఏ పార్టీకి జై కొడతారన్న విషయం ఆసక్తికరంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి జయకేతనం ఎగురవేశారు. ఓటమితో కొంతమేర నారాజ్‌గా ఉన్నప్పటికీ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ, భవిష్యత్ కార్యాచరణపై దృష్టిసారించారు. తద్వారా అభివృద్ధి కార్యక్రమాలు, నిధుల విషయంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మధ్య ప్రోటోకాల్ రగడ కొనసాగుతూ వస్తున్నది. కొద్దిరోజులుగా కాంగ్రెస్‌లో చేరికలు పెరిగిపోతుండడంతో గతానికి మించి బలం, బలగాన్ని మూటగట్టుకుంటుంది. కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి సన్నిహితుడవడం, ఆయన గెలుపు బాధ్యత మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి అప్పగించారు. ఇతర పార్టీలకు భిన్నంగా అభ్యర్థితో రోడ్‌షోలు, అనుచరవర్గంతో కొమ్మూరి క్యాపెయినింగ్ చేయిస్తున్నారు. ఇదేక్రమంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ గెలుపు కోసం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అంతా తానై వన్‌మెన్ ఆర్మీలా వ్యవహరిస్తున్నారు. తనకన్నా రె ట్టింపు మెజార్టీ తీసుకురావలని నియోజకవర్గంలోని గ్రామాలలో సుడిగాలి పర్యటన చేస్తుండడంతో పాటు పార్టీ బలగాన్ని మొహరిస్తున్నారు. ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకుంటూ, లోపాలను ఎత్తిచూపుకుంటూ ఓటర్లను ఆకట్టుకుంటునేందుకు ప్రయత్నిస్తున్నారు. పోలింగ్‌కు మరో మూడురోజులు మిగిలిఉన్న క్రమంలో విలక్షణ తీర్పు కట్టబెట్టే జనగామ ఓటరు ఎవరిని కరుణిస్తారన్నది, ఎమ్మెల్యే పల్లా, కొమ్మూరిలో ఎవరు క్రెడిబులిటీ సాధిస్తారని స్థానికంగా, భువనగిరి పార్లమెంటు పరిధిలో ఆసక్తిరేపుతున్నది.

కాంగ్రెస్ గారడీ చేసి అధికారంలోకి వచ్చింది

● ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, మే 9: గారడీ చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరుగ్యారంటీలు అమలు చేయలేదని, పాలన చేతగాక ఐదునెలల్లోనే రాష్ట్రాన్ని ఆగమాగం చేసిందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ భువనగిరి లోక్‌సభ అభ్యర్థి క్యామ మల్లేశ్‌తో కలిసి గురువారం సాయంత్రం చేర్యాల పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. అంగడిబజారు చౌరస్తా వద్ద నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో ఎక్కడచూసినా పచ్చని పొలాలు, చెరువుల నిండా నీరు, పంటలకు సరిపడా సాగునీరు, 24గంటల కరెంటు ఉందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గతంలో ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీ సంతకాన్ని ఫోర్జరీ చేశారని అన్నారు. కొమురవెల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్టెప్పులేశారు. సారే కావాలంటున్నారు అన్న పాటకు కార్యకర్తలు స్టెప్పు లేయడాన్ని గమనించిన ఎమ్మెల్యే పల్లా వారితో కాలుకదిపి జోష్ పెంచారు. కొమురవెల్లి మల్లన్నను బీఆర్‌ఎస్ భువనగిరి లోక్‌సభస్థానం అభ్యర్థి క్యామ మల్లేశ్ గురువారం దర్శించుకున్నారు.



మల్లన్నకు ముఖమండపంలో పట్నంవేస్తున్న బీఆర్‌ఎస్ భువనగిరి అభ్యర్థి క్యామ మల్లేశ్

బీఆర్‌ఎస్ అభ్యర్థి తరఫున ప్రచారం

జగదేవ్‌పూర్, మే 9: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి తరఫున ఆయన అన్న జయచంద్రరెడ్డి భార్య సుదితారెడ్డి మండలంలోని అలిరాజ్‌పేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమెవెంట సీనియర్ నాయకులు కేశిరెడ్డి నర్సింహరెడ్డి, మాజీ ఎంపీటీసీ మధుసూదన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కోఆప్షన్ సభ్యుడు ఇక్బాల్, నాయకులు బాపురెడ్డి, సత్తిరెడ్డి, సురేశ్, జీవన్‌రెడ్డి తదితరులున్నారు.

● **మర్కుక్:** మండల పరిధిలోని కేసీఆర్ దత్తత గ్రామం నరసన్నపేటలో జడ్పీటీసీ మంగమ్మ రామచంద్రం ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాధవి రాజిరెడ్డి, నాయకులు నర్సింహులు, యాదవరెడ్డి, కనకయ్య, బాలయ్య తదితరులు ఉన్నారు.

● **గజ్వేల్:** గజ్వేల్ మండల పరిధిలోని అనంతరావుపల్లిలో ఉపాధిహామీ పని వద్ద బీఆర్‌ఎస్ అభ్యర్థికి మద్దతుగా గజ్వేల్ జడ్పీటీసీ పంగ మల్లేశం ప్రచారం చేశారు. ఆయనవెంట మాజీ సర్పంచ్ కొమురయ్యయాదవ్, నాయకులు రజనీకాంత్, శివకుమార్ ఉన్నారు.

● **ములుగు:** మండలంలోని అన్నాసాగర్, గంగాధర్‌పల్లి, వాగునూతి, చిలసాగర్ గ్రామాల్లో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి ఎన్నికల ప్రచారం చేశారు. ఆయనవెంట కరుణాకర్‌రెడ్డి, బాల్‌రెడ్డి ఆయా గ్రామాల సీనియర్ నాయకులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

● **నారాయణరావుపేట:** నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ దుర్గం పరుశురాములు ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భాను చందర్, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మాజీ ఉపసర్పంచ్ కనకాంబరం, కిషన్, స్వామి, వేణు, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



జగదేవ్‌పూర్: ప్రచారం చేస్తున్న సుదితరెడ్డి

● **చిన్నకోడూరు:** పార్లమెంట్ ఎన్నికల్లో వెంకట్రామారెడ్డికే తమ ఓట్లు వేస్తామని మండలంలోని విఠలాపూర్ గ్రామ యాదవ సంఘంసభ్యులు గురువారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ఏకగ్రీవ తీర్మానపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీ ప్రేమభిమానాలు ఎల్లప్పుడూ ఇలాగే ఉండాలన్నారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ నవీన్, నాయకులు పాల్గొన్నారు.

● **సిద్దిపేట టౌన్ :** బీఆర్‌ఎస్‌కే తమ సంపూర్ణ మద్దతంటూ, సిద్దిపేటలో ఉంటున్న రాజస్థాన్ మార్వాడి సమాజం గురువారం సిద్దిపేట పట్టణంలో సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి ప్రకటించారు. హరీశ్‌రావు మాట్లాడుతూ.. మద్దతు ప్రకటించిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

అరచేతిలో వైకుంఠం చూపించిపోయిన మోదీ

● కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్



కూరగాయల దుకాణం వద్ద ఓట్లు అభ్యర్థిస్తున్న వినోద్‌కుమార్

కోహెడ, మే 9 : ప్రధాని మోదీ వేములవాడకు వచ్చి అరచేతిలో వైకుంఠం చూపించిపోయారని కరీంనగర్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ విమర్శించారు. వారణాసి(కాశీ)ని వేల కోట్లతో అభివృద్ధి చేసిన మోదీ దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ రాజన్న ఆలయానికి ఏం చేశారని ప్రశ్నించారు. దేవుళ్ల పేరుతో రాజకీయాలు చేసుడే తప్ప వేములవాడ రాజన్నకు చిల్లిగవ్వ ఇవ్వలేదన్నారు. సిద్దిపేట జిల్లా కోహెడలో గురువారం మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్, ఎమ్మెల్సీ తక్కళ్ళపల్లి రవీందర్‌రావుతో కలిసి ఆయన రోడ్ షో నిర్వహించి కార్నర్ సమావేశంలో మాట్లాడారు. బండి సంజయ్ తన రాజకీయ భవిష్యత్ కోసం మాత్రమే ప్రజల మనోభావాలతో ఆడుకుంటున్నాడే తప్ప అభివృద్ధి కోసం చేసిందేమీ లేదని పేర్కొన్నారు. ఎంపీ బండి సంజయ్ ఐదేళ్లలో ఐదు కోట్లు కూడా తేలేదని విమర్శించారు. కనీసం ఒక్క గుడికి, బడికి నిధులు తేలేదని, ఏం పని చేయని బండి సంజయ్‌కి ఎందుకు ఓట్లు వేయాలని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మార్పు తెస్తామంటే ప్రజలు నమ్మి ఆగమై ఇప్పుడు మోసపోయారన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు 24 గంటల కరెంటు వచ్చేదని, కాంగ్రెస్ వచ్చాక కరెంటు కోతలతో మోటార్లు కాలుతున్నాయన్నారు కార్యక్రమంలో ఎంపీపీ కీర్తి సురేష్, రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కర్ర శ్రీహరి, పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, వెంకటస్వామి, వైస్ ఎంపీపీ రాజిరెడ్డి, నాయకులు మహేందర్, శ్రీకాంత్, లక్ష్మణ్, రహీం, కుమారస్వామి, శంకర్, వంశీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మారుస్తానన్న మోదీని ఓడించాలి

● ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నాల కుమార్

గజ్వేల్, మే 9: భారత రాజ్యాంగాన్ని మారుస్తానన్న మోదీని ఓడించాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నాల కుమార్ పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో గురువారం మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు జక్కుల రాజు, అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు చిప్పల యాదగిరితో కలసి విలేకరులతో మాట్లాడారు. ప్రజాసంక్షేమాన్ని, సుస్థిర అభివృద్ధిని గాలికి వదిలేసి, అధికారం కోసం మత విద్వేషాలు రెచ్చగొడుతున్న మోదీని గద్దె దింపాలని ఎస్సీ, ఎస్టీ, బీసీలను కోరారు. రాజ్యాంగాన్ని మారుస్తామని, రిజర్వేషన్లు ఎత్తివేస్తామని పదేపదే ప్రకటిస్తున్న మోదీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి పన్నుల రూపంలో రూ.12లక్షల కోట్లు వసూలు చేసి రాష్ట్రానికి నిధులను విడుదల చేయలేదన్నారు. బడాబాబులకు రూ.16లక్షల కోట్ల మాఫీ చేశారని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్రలకు పాల్పడుతున్న బీజేపీని ఓడించాలన్నారు. ఆయన వెంట కొండపాక పీఏసీఎస్ డైరెక్టర్ మెరుగు బాల్‌నర్సయ్య, ఎమ్మార్పీఎస్ టీఎస్ నాయకులు గంగాల మల్లేశం, మాల మహానాడు జిల్లా కార్యదర్శి తాడెం కృష్ణ, నియోజకవర్గ నాయకులు బోనాల నర్సింలు, బోనాల బాలకృష్ణ, జప్తి నాచారం మాజీ సర్పంచ్ ముస్త్యాల కనకయ్య దుర్గాసాయి ఉన్నారు.

ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక మోదీని ఓడించాలి

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ మల్లికార్జున్



సదస్సులో మాట్లాడుతున్న మల్లికార్జున్

గజ్వేల్, మే 9: ప్రజలు, రైతు, కార్మిక వ్యతిరేక మోదీని ఓడించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ మల్లికార్జున్ కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికలు-కార్మికవర్గం కర్తవ్యం సదస్సులో మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసిందని, రైతులకు వ్యతిరేఖంగా నల్ల చట్టాలను రూపొందించిందని, రైతుల పోరాటానికి దిగడంతో వాటిని రద్దు చేసిందన్నారు. 12గంటల పనివిధానం కోసం కార్మిక సంక్షేమ చర్యలను విస్మరించి కార్పొరేట్లకు అనుకూలంగా కోడ్‌లను రూపొందించిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, నాయకులు నాయిని యాదగిరి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య కాముని గోపాలస్వామి, బండ్ల స్వామి, వేణుగోపాల్, రవి, బాల్‌లక్ష్మి, యాదగిరి, నర్సింహులు, కనకయ్య, మడుపు భూంరెడ్డి, గాడిపల్లి భాస్కర్, సర్దార్‌ఖాన్, నగేశ్ తదితరులున్నారు.

భారత రాజ్యాంగ వ్యతిరేఖ శక్తులను ఓడిద్దాం

● ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రోళ్ల రవిబాబు

గజ్వేల్, మే 9: భారత రాజ్యాంగ వ్యతిరేఖ శక్తులను ఓడిద్దామని ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రోళ్ల రవిబాబు పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజల బతుకులను ఆగం చేసిన బీఆర్‌ఎస్ కాలగర్భంలో కలిసి పోయిందని, అన్ని వర్గాల ప్రజలను నట్టేట ముంచుతున్న బీజేపీకి ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. బీజేపీ పదేళ్ల పాలనలో అణగారిన వర్గాలకు చేసిందేమీ లేదన్నారు. అంతేకాకుండా రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లను రద్దు చేస్తా అంటున్న బీజేపీని ప్రజలు ఓడించాలని పిలుపునిచ్చారు. ఆయనవెంట రాష్ట్ర కమిటీ సభ్యులు జ్యోతి, జిల్లా అధ్యక్షుడు సదన్, జిల్లా నాయకులు డీబీరాజు, వెంకటప్రసన్న, యాదగిరి, నందు, రమేశ్, రాజు ఉన్నారు.

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా

● అదనపు డీసీపీ మల్లారెడ్డి

తొగుట, మే 9: శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటాన్నామని అదనపు డీసీపీ మల్లారెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం తొగుట సర్కిల్ కార్యాలయంలోం పోలీసు అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్కిల్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలపై ఎప్పటికప్పుడు గట్టి నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. నేరస్థులపై నిఘా ఉంచాలన్నారు. ప్రతీ పౌరుడు ఓటుహక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అసాంఘీక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి, తొగుట సీఐ లతీఫ్, సర్కిల్ పరిధిలోని వివిధ పోలీసుస్టేషన్ల ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం దేశంలో ఓటు హక్కు వజ్రాయుధం

● సిద్దిపేట వన్‌టౌన్, టూటౌన్ సీఐలు

సిద్దిపేట క్రైం, మే 9: ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు వజ్రాయుధమని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐలు పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా వన్‌టౌన్ సీఐ లక్ష్మీబాబు, ఎస్‌ఐ నరసింహరావు, పోలీస్ సిబ్బంది, కేంద్ర బలగాలతో కలిసి గురువారం సిద్దిపేట పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పుష్పాంజలి ఎక్స్‌రోడ్, విక్టరీ ఎక్స్ రోడ్, రైతు బజార్ మీదుగా అంబేడ్కర్ చౌరస్తా, వరకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. టూటౌన్ సీఐ ఉపేందర్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో పట్టణంలోని నర్సాపూర్ ఎక్స్‌రోడ్, నెహ్రూ పార్క్, పుష్పాంజలి ఎక్స్‌రోడ్, సుభాష్ రోడ్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.

● **చేర్యాల:** పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో చేర్యాల పోలీసులు గురువారం పట్టణంతో పాటు మండలంలోని ఆకునూరు గ్రామంలో కేంద్రబలగాలతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీను మాట్లాడుతూ.. ప్రజలు నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని, అందుకు తాము పటిష్ఠబందోబస్తు చేపట్టనున్నామని తెలిపారు. ఎవరైనా ప్రలోభాలకు గురిచేసినా, డబ్బు, మద్యం పంపిణీ చేసినా వెంటనే 100నంబరుకు సమాచారం అందించాలని సూచించారు. ఆయనవెంట చేర్యాల ఎస్‌ఐ దామోదర్, కొమురవెల్లి ఎస్‌ఐ నాగరాజు తదితరులు ఉన్నారు.



చేర్యాల: ఆకునూరులో ఫ్లాగ్‌మార్చ్ దృశ్యం

● **గజ్వేల్:** ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా పిలుపునిచ్చారు. గజ్వేల్ మండలం బూర్గుపల్లి, జాలిగామ, బెజుగామ గ్రామాల్లో గజ్వేల్ ఎస్‌ఐలు, సిబ్బంది, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందితో కలసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. వారితో ఎస్‌ఐలు శంకర్, యాదగిరిరెడ్డి తదితరులున్నారు.

● **మద్దూరు:** మండలంలోని నర్సాయపల్లిలో చేర్యాల సీఐ శ్రీను ఆధ్వర్యంలో గురువారం మద్దూరు ఎస్‌ఐ షేక్ యూనస్ అహ్మద్ అలీ, కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడారు. ఎన్నికల్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు.

● **దుబ్బాక/మిరుదొడ్డి:** ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని దుబ్బాక సీఐ శ్రీనివాస్ అన్నారు. గురువారం దుబ్బాక మండలం పెద్దచీకోడ్, రామక్కపేట గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. అలాగే మిరుదొడ్డి మండలంలోని చెప్యాల, అల్వాల్, రుద్రారం గ్రామాల్లో కూడా ప్రజలకు భరోసా కల్పించడానికి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో దుబ్బాక, మిరుదొడ్డి ఎస్‌ఐలు గంగరాజు,పర్శరాములు తదితరులున్నారు.

● **మర్కుక్:** ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిపే పరిస్థితులను కల్పించడం కోసం మర్కుక్ ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి, సిబ్బంది, కేంద్ర బలగాలతో కలిసి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాములపర్తి గ్రామంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.